www.prajasakti.com

ప్రజాశక్తి

5

బుధవారం 5 జులై 2023

వైఎస్ఆర్





అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి

యువతకు ఆదర్శం 'అల్లూరి' 6లో

ఖరీఫ్.. మందకొడి



ఖరీఫ్-2022 సీజన్ సాగు మందకొడిగా సాగుతోంది. జూన్ మొదటి వారం నుంచి నైరుతి పవనం మొండికేసింది. ఫలితంగా సాగులో స్తబ్ధత నెలకొంది. జిల్లాలోని 36 మండలాల పరిధిలోని సాగు లెక్కలను పరిశీలిస్తే 5,770 ఎకరాల్లో విత్తనం పడినట్లు తేలింది. 1.87 లక్షల ఎకరాల్లో విత్తనం పడవలసి ఉన్నట్లు తెలుస్తోంది. 96.85 శాతం విస్తీర్ణంలో విత్తనం పడాల్సి ఉంది. ప్రభుత్వం ఇటీవల గండికోట నుంచి నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. త్వరలో కెసికి సైతం నీటిని విడుదల చేసే అవకాశాల నేపథ్యంలో 92 వేల ఎకరాలు సాగులోకి రానుంది. ఏదేమైనా ఖరీఫ్ లక్ష్యాన్ని అలస్యంగానైనా అందుకుంటుందా అనే సందేహం కలుగుతోంది. జులైలో ఇప్పటి వరకు ఆశాజనకమైన వాతావరణం కనిపిస్తున్న నేపథ్యంలో సాగు ఊపందుకునే అవకాశాలు తక్కువేనే వాదన వినిపిస్తోంది.

- **తగిన వానలు లేక 3.15 శాతమే సాగు**
- **5,770 ఎకరాల్లోనే విత్తనం**
- **అధికంగా 2,398 ఎకరాల్లో పత్తి**

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వ్యవసాయ శాఖ 1.90 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలోని 36 మండలాల పరిధిలో 5,770 ఎకరాల్లోనే విత్తనం పడింది. 1.84 లక్షల ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. గతేడాది ఇదేసమయానికి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతేడాది సాగుతో పోలిస్తే 50 శాతం కూడా సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. త్వరలో కడప-కర్నూలు కాల్వకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో 92 వేల ఎకరాల్లో వరి సాగు ఊపందుకునే అవకాశం ఉంది అంచనాలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. జిల్లా వ్యాప్తంగా వరి, ఇతర పంటల సాగు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయని అంచనా వేసుకుంటోంది.

వర్షపాతం...ఆందోళనకరం

జిల్లాలో జూన్‌లో 68.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి నైరుతి తిరోగమనం కారణంగా 35.9 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. సీజన్ ఆరంభంలో మంచి వర్షపాతం నమోదైతే విత్తనం వేయడానికి అను కూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ఫలితంగా ఖరీఫ్ సీజన్ ఊపందు కునే అవకాశం ఉంటుంది. నమోదు స్థాయికి సగం మాత్రమే వర్షపాతం నమోదు కావ డంతో వ్యవసాయబోర్ల కింద మాత్రమే పంటల సాగు నడ స్తోంది. మెట్టప్రాంతాల్లో విత్తనం విత్తడానికి అవకాశం లేకుండా పోయింది.



మేఘం కరుణించేనా!

జులైలో 96.7 మి.మీ, ఆగస్టులో 118.4. మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జులైలో 9.35 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావడంతో రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం అల్పపీడన వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలు రైతాంగం ఆశాభావంతో ముందుకు కదులుతోంది. జులైలో నైరుతి ఏమే రకు సహకరిస్తుందనే అంశంపై ఖరీఫ్ సాగు ఆధారపడి ఉందని చెప్ప వచ్చు.

ఆశాజనకంగా పత్తి

ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగవుతోంది. 2,398 ఎకరాల్లో విత్తనం పడింది. 2,092 ఎకరాల్లో మినుములు, 4,487 ఎకరాల్లో వేరుశనగ విత్తనం పడింది. జిల్లాలోని ప్రధాన ఆహార పంటల్లో మినుములు 837 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, 2092 ఎకరాల్లో విత్తనం పడడం గమనార్హం. 53,268 ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా 2,398 ఎకరాల్లోనే పడినట్లు తెలుస్తోంది. ఇతర పంటల సాగుదలను పరిశీలిస్తే మొక్కజొన్న 1407 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 61 ఎకరాల్లో సాగుకు నోచుకుంది. పప్పుదినుల సాగులో కందులు 8528 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 18 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. ఆయిల్ సీడ్స్ వివరాలను పరిశీలిస్తే పొద్దుతిరుగుడు 2889 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 89 ఎకరాల్లో సాగు కావడం ఆందోళన కలిగిస్తోంది. సోయా బీన్ 2119 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 2.5 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడడం వర్షాభావ తీవ్రతను తెలుపుతోంది. మిరప 3,198 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 195 ఎకరాల్లోనే విత్తనం పడడం ఆందోళన కలిగిస్తోంది. ఉల్లి, ధనియాల పంటల సాగు ఆనవాలే కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. మరో వాణిజ్య పంట పసుపు 7,518 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఒక్క ఎక రమూ సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. జిల్లాలోని ప్రధాన ఆహారపు పంట వరి 82,041 ఎకరాలకు గానూ 261 ఎకరాల్లోనే సాగు కావడం గమనార్హం.

లక్ష్యాన్ని అందుకుంటాం

ఖరీఫ్-2022 లక్ష్యాన్ని అందుకుంటాం. కెసి ప్రాంతాల్లో 92 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. వరి గణనీయంగా సాగుకు అవకాశం ఉంది. 15,000 టన్నుల ఎరువులను సైతం అందుబాటులో ఉంచాం. జిల్లా ఖరీఫ్ లక్ష్యాన్ని అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కడప.

ముఖ్యమంత్రి పర్యటన ఖరారు

మూడు రోజుల పాటు జిల్లాలోనే..

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 8, 9, 10 తేదీల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 8వ తేదీ మధ్యాహ్నం కళ్యాణదుర్గం నుంచి ఇడుపులపాయకు చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటలకు కీ.శే. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. తర్వాత సింహాద్రిపురం మండల ప్రజాప్రతినిధులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. 9న ఉదయం 9 గంటలకు గండికోటకు చేరుకుంటారు. ఓబె రాయ్ హోటల్‌కు శంకుస్థాపన చేస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులకు చేరుకొని 11.05 గంటలకు కొత్త మున్సిపల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాటామంతి నిర్వహిస్తారు. 11:45 గంటలకు రాణి తోపులో ఉన్న నగరవనాన్ని ప్రారంభిస్తారు. 12.10 గంటలకు గరండాల నది బోట్‌ను, మధ్యాహ్నం 12:50 గంటలకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రం, 1.25 గంటలకు ఎపికార్ల్‌లోని న్యూ బయో సైన్స్ ప్రారంభిస్తారు.1. 50 కి ఆర్ అండ్ బి గెస్ట్ చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. 2.30 గంటలకు క్రీడా అకాడమీ ప్రారంభిస్తారు. 3.00 గంటలకు భాకరాపురం నుంచి ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేసి 10వ తేదీ ఉదయం 8:50 కు ఇడుపులపాయ నుంచి కడప ఆర్ట్స్ కళాశాల చేరుకొని రాజీవ్ మార్కెట్ రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం రాజీవ్ పార్క్ ప్రారంభించి, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 10:45కు ఆర్ట్స్ కాలేజ్ నుండి కొప్పర్తి చేరుకొని అల్దిక్సన్‌కు శంకుస్థాపన చేస్తారు 12 10 కి కడప ఎయిర్‌పోర్టు చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరుతారు.



ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల జిల్లా పర్యటన నిమిత్తమై ఈనెల 8న కడప జిల్లా పర్యటకు రానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా నూతన మున్సిపల్ కార్యాల భవనాన్ని, రాణి తోపు, గరండాల బోటింగును, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాల భవనాలను, హాకీ, క్రికెట్ సేడియాలను స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదులను ఆయన ప్రారంభించనున్నారని, ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనపై మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డితో చర్చించారు. పర్యటన విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, పాడాప్రత్యేక అధికారి అనిల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి , తహశీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి కిందపడి విద్యార్థి మృతి

- పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు
- కొనసాగుతున్న విచారణ
- ఎస్‌పి కె.కె.ఎన్.అన్బురాజన్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా కాజీపేట మండలం కొత్త నెల్లూరులోని బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్లో ఈ నెల ఒకటవ తేదీ ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థి సోహిత్ ఐదవ అంతస్తు నుంచి కింద పడి మృతి చెందినట్లు ఎస్‌పి అన్బురాజన్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిసి కెమెరాలను పరిశీలించిన తరువాత ఈ నెల 1వ తేదీ తెల్లవారుజామున 5.07 గంటలకు సోహిత్ ఒంటరిగా హాస్టల్లో ఉన్న మంచం మీద నుంచి లేచి ఇతర విద్యార్థులు నిద్రిస్తూ ఉండగా బయటికి వెళ్లాడని పేర్కొన్నారు. 5.08 గంటలకు పైఅంతస్తు మెట్లను వేగంగా ఎక్కాడని తెలిపారు. ఇనుప గేటు వద్దకు వచ్చి ఎవరూ లేని విషయాన్ని గమనించి గేటు తెరచి ఐదవ అంతస్తులో ఉన్న టెర్రస్ పైకి వెళ్లాడని చెప్పారు. 5.09 గంటలకు డిజిటల్ గేటు వద్ద అందుబాటులో ఉన్న పెద్ద రాయిని తెచ్చుకోవడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. కుదరకపోవడంతో దానిని అక్కడే వదిలేసారని తెలిపారు. దగ్గరలో ఉన్న ఒక బకెట్‌ని బోర్లించుకుని గోడ ఎక్కారని చెప్పారు. గోడపై పాదాల మట్టి ముద్రలు గమనించామని పేర్కొన్నారు. 5.10 గంటలకు గోడ పైనుంచి కిందకు దూకాడని తెలిపారు. భవనం మొదటి అంతస్తు దగ్గర వి ఆకారంలో ఉన్న ఇన్సులేటెడ్ విద్యుత్ తీగలపై పడి ఆరు నుంచి ఎనిమిది నిమిషాల పాటు వేలాడారని చెప్పారు. 5.18 గంటలకు హాస్టల్ ఆవరణలో నేలపై పడిపోయాడని పేర్కొన్నారు. 5.22 గంటలకు స్కూల్ సిబ్బంది రియాజ్ విద్యార్థి సోహిత్ పడి ఉండడాన్ని గమనించాడని తెలిపారు. విద్యార్థి వద్దకు పరిగెత్తి ఇతర సిబ్బందితో కలిసి విచారించారని చెప్పారు. కడుపునొప్పి అని చెప్పడంతో విద్యార్థి తండ్రికి ఫోన్ చేసి విషయం తెలియజేశారని పేర్కొన్నారు. అతని మేనత్త స్కూల్ వద్దకు రాగా చికిత్స నిమిత్తం పంపించారని తెలిపారు. చెన్నూరులోని ఆర్‌ఎంపి డాక్టర్ వెంకటేష్ వద్ద ప్రథమ చికిత్స చేయించుకుని, రెండు గంటలైనా కడుపునొప్పి తగ్గలేదని, విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడి వైద్యులు 9:15 గంటలకు విద్యార్థి చనిపోయినట్లు నిర్ధారించారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ సెక్షన్ 75 కింద పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. ఐదో అంతస్తు నుంచి ఎందుకు కింద పడ్డారనే దానిపై విచారణ సాగుతోందన్నారు.

ప్రతి పేదవాడి ఇంటికీ 'పుత్తా'

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ ప్రజలకు చేయబోవు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, వారి కష్టాలు తెలుసుకోవడానికి కమలాపురం నియోజకవర్గంలో మన ఊరికి, మన ఇంటికి మాజీ ఎమ్మెల్సీ, ఇన్‌ఛార్జి పుత్తా నరసింహా రెడ్డి వస్తున్నారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ ప్రజలు తెలిపారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని మున్నూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేరుగా 'నేనున్నా' అంటూ వారి కష్టాల్లో పాలు పంచుకుంటూ నిత్యం ప్రజల్లో తిరుగుతున్నరానికి తెలిపారు. ముఖ్యంగా కమలాపురం అభివృద్ధికి పనిచేస్తున్నారని తెలిపారు. సమావేశంలో మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి నజీర్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మంజూరు అహమ్మద్ పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.1.70 లక్షలు

చింతకొమ్మదిన్నె: మండల పరిధిలోని కొత్తపేటలో వెలిసిన శ్రీ గంగమ్మ దేవస్థానం హుండీ ఆదాయం రూ. 1.70 లక్షలు వచ్చినట్లు ఆలయ ఇఒ సురేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మే 15 నుంచి జులై 4 వరకు హుండీ ఆదాయం లెక్కించామని చెప్పారు. మొత్తాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ దేవస్థానం చైర్మన్ బుసిరెడ్డి పార్వతమ్మ గారి విశ్వనాథరెడ్డి మరియు సభ్యులుపాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కాంట్రాక్టు ఉద్యోగుల సలహాలోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, సుదర్శన్ డిమాండ్ చేశారు. మంగళవారం జిజిహెచ్ ఓపి బ్లాక్ ఎదుట 2వ రోజు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు కాంట్రాక్టు ఉద్యోగులకు ఎడ్యుకేషన్‌లో ఏమాత్రం తేడాల్లేవని, వారికి ఇచ్చే వేతనాల్లో తేడాలు ఉన్నాయని చెప్పారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం 2014, జూన్ 2 నాటికి ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తయిన వారిని అందరిని రెగ్యులర్ చేస్తామని చెప్పిందన్నారు. ఇది సంతోషించాల్సిన విషయమని తెలిపారు. ఆ పద్ధతిలోనే అవుట్సోర్సింగ్ ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు భాస్కర్, బాలాజీ రావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు జయరాం, సుబ్బారావు, లక్ష్మయ్య, బాదుల్లా, పవన్, మరియమ్మ, జయసుధ, రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

మానికొండ సూర్యావతి వర్ధంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మానికొండ సూర్యవంశం వర్ధంతి సభను మంగళవారం స్థానిక పాత బస్టాండ్ ఐద్వా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సుబ్బమ్మ మాట్లాడుతూ సూర్యావతి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉద్యమం నిర్మించడంలో ప్రథమ పాత్ర వహించారన్నారు. మహిళలు బయటకు రావడానికి వీలుకాని ఆ రోజుల్లో హక్కుల కోసం, సమస్యల పరిష్కారానికి వారిని పోరాటాలకు సంసిద్ధం చేసిన ఘనత ఆమెది అన్నారు. ఆమె భర్త చనిపోయి ఒంటరిగా ఉన్న మొక్కవోని ధైర్యంతో, మహిళ సమస్యల పట్ల పట్టుదలతో పోరాటాలు సాగించారన్నారు.ఆమె మూడు పర్యాయాలుగా సర్పంచిగాను, మండల అధ్యక్షురాలు, ఎమ్మెల్యేగా నిస్వార్థంతో పనిచేశారన్నారు. 13 ఏళ్ల వయసులో స్వాతంత్ర్యం, దేశం కోసం పోరాడారని తెలిపారు. మహిళలు ఆమె ఆశ స్ఫూర్తితో హక్కుల కోసం పోరాటాలు సాగించాలని, ఆశయాల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జమీల, నాయకురాలు కామేశ్వరమ్మ, శంషాబాద్, సుజాత, రమాదేవి, సిపిఎం జిల్లా కార్య దర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ్మోహన్, సిఐటియు అధ్యక్షుడు కె. శ్రీనివాసులురెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, సిపిఎం నాయకులు పాపిరెడ్డి పాల్గొన్నారు **పోరుమామిళ్ల టౌన్ :** మణికొండ సూర్యావతి త్యాగాలు మరవలేనివని ఐద్వా నాయకులు గౌసియా బేగం అన్నారు. సూర్యావతి 30వ వర్ధంతి సభ పోరుమామిళ్లలోని జి.బి. నగర్ కాలనీలోని ఐద్వా సంఘం కార్యా లయంలో ఘనంగా నిర్వహించారు. మణికొండ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణికొండ సూర్యావతి త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మండ ల కమిటీ నాయకురాలు బీబి,లూర్దు మేరీ,మాబున్నీ,లక్షుమ్మ, గురమ్మ, ఐద్వా సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

కడప అర్బన్ : న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని, వృత్తి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా అధ్యక్షులు సి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఐఎఎల్ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు బయట న్యాయవాదులు నిరసన చేపట్టారు. న్యాయవాదుల డిమాండ్లను నెరవేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఐఎఎల్ నగర అధ్యక్షులు రామ కొండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, సీనియర్ న్యాయవాదులు సంపత్ కుమార్, భరణి కుమార్ నాయుడు, ప్రమోద్ కుమార్ రెడ్డి, జింకా సుబ్బరాయుడు, బొగ్గుల గురప్ప, వెంకట శివ, ఉమాదేవి, చంద్రావతి, అహ్మద్, గురు రాజా, మదనమోహన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వెలుగు సిసిపై సస్పెన్షన్ వేటు

క్రిమినల్ చర్యలకు ఫిర్యాదు - కేసు నమోదుపై మీనమేషాలు

ప్రజాశక్తి - వల్లూరు

మండల సమాఖ్యలో లక్షలాది రూపాయల అక్రమాలకు పాల్పడ్డ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ ఆర్. సునీతపై సస్పెన్షన్ వేటు పడింది. వివిధ నిధులకు సంబంధించి దశలవారీగా లక్షల రూపాయలను మహిళా సమాఖ్య ఖాతా నుంచి తన సొంత ఖాతాలకు బదలాయించుకొని నిధుల అక్రమ దుర్వినియోగానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. కొంతకాలం కిందట వల్లూరు మండల సమైక్యలో సిసిగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై కమలాపురానికి వెళ్లారు. ఆమె బదిలీ తర్వాత అనేక ఆరోపణలు వెలుగు చూశాయి. 2014 నుంచి ఈ ఏడాది జూన్ వరకు ఆమె ఈ మండలంలో సిసిగావిధులు నిర్వహించారు. ఆ సమయంలో గ్రామ సమాఖ్యలకు సంబంధించిన నిధుల వినియోగంపై పలు క్లస్టర్లలోని యానిమేటర్లు దృష్టి సారించారు ఈ క్రమంలో సుమారు రూ.30 లక్షల మేరా అక్రమాలకు పాల్పడినట్లు వెలుగు చూసింది. ఈ అంశాన్ని మహిళా సమాఖ్య సభ్యులు డిఆర్‌డిఎ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్వయంగా డిఆర్‌డిఎ పీడీ ఆనందనాయక్, ఏపీడీ ప్రసాద్ పది రోజుల కిందట స్వయంగా మండల సమాఖ్యలో విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించగా ఇసుక కమీషనర్లకు సంబంధించి కూడా సిసి అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. మొత్తం దాదాపు రూ. 53 లక్షలు మహిళా సంఘాలకు సంబంధించిన నిధులను తన ఖాతాతో పాటు తన బంధువులు , మిత్రుల ఖాతాకు బదలాయించినట్లు అధికారులు ఒక అంచనాకొచ్చారు. దీనిపై సమగ్రంగా విచారించేందుకు థర్డ్ పార్టీ ఎంక్వైరీకి డిఆర్‌డి పీడీ ఆదేశించారు. థర్డ్ పార్టీ ఎంక్వైరీ అంశం అటకెక్కింది. అధికారులు కాలయాపన చేస్తుండడంతో తాము నష్టపోయే పరిస్థితి ఉందని కొంతమంది యానిమేటర్లు పోలీసు అధికారుల ఆశ్రయించినట్లు సమాచారం. ఇందులో సిసి సునీత నిధులను దుర్వినియోగం చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులకు యానిమేటర్లు ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో డిఆర్‌డిఎ అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడ్డ కమ్యూనిటీ కోఆర్డినేటర్ పై చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా సమాఖ్యకు సూచించారు. దీంతో జిల్లా సమాఖ్య ఆర్. సునీత పై సస్పెన్షన్ వెట్ వేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిందిగా మండల సమాఖ్యను ఆదేశించారు. ఈ మేరకు మండల సమైక్య అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం వల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న సమాఖ్య సభ్యులు

అరకొర సమాచారంతో ఫిర్యాదు

జిల్లా సమాఖ్యసూచనల మేరకు మండల సమాఖ్య అరకొర సమాచారంతో పోలీసులను ఆశ్రయించారు. నిధులు ఎలా దుర్వినియోగమయ్యాయి, అందుకు గల బాధ్యులు ఎవరు అనే వివరాలను స్పష్టంగా ఇవ్వకపోవడంతో మొదట పోలీసులు ఫిర్యాదులు స్వీకరించేందుకు తిరస్కరించారు. మళ్లీ ఫిర్యాదు తయారు చేసుకొని పోలీసులకు ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇదిలా ఉంటే ఇప్పటికే పోలీసులకు స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులలోని పేర్లను ప్రస్తుతం మండల సమాఖ్య చేస్తున్న ఫిర్యాదులో పేర్కొనకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్పష్టంగా నిధుల్లో దుర్వినియోగానికి ఏరియా కో-ఆర్డినేటర్ రఘునాథరెడ్డి సహకరించారని యానిమేటర్లు ఎస్‌పికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. చివరికి వల్లూరు పోలీసులకు ఇచ్చే ఫిర్యాదులు సునీత పేరు మినహాయించి ఎవరి పేరును చేర్చకపోవడంపై ఆరోపణలు వెలువత్తుతున్నాయి.

'నేనూ సత్యాన్వేషణ చేస్తా'

కడప అర్బన్ : ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి సత్యా న్వేషణ దీక్ష చేస్తే తాను కూడా చేస్తానని టిడిపి ప్రొద్దుటూరు ఇన్‌ఛార్జీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని గాయత్రీ టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విమర్శలకు స్పందించనని చెప్పిన ఎమ్మెల్యే ప్రొద్దుటూరులో కడప తరహా హత్యలు జరుగుతాయని చెప్పగానే స్పందించారని తెలిపారు. సిసి కెమెరాలు పని చేయ కుండా, భూ, ఇసుక దందాలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యాన్వేషణ దీక్ష చేస్తానడం హాస్యాప్పదమని పేర్కొ న్నారు. ధమ్ము, ధైర్యం ఉంటే నం దం సుబ్బయ్య హత్య కేసులో సిబి ఐ విచారణ కోరుతూ ఎమ్మెల్యే అఫి డవిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కడప, కర్నూలు జట్లు విజయం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎపిఎస సౌత్ జోన్ అండర్ - 19 క్రికెట్ మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు విజయం సాధించాయి. మంగళవారం వైయస్ రాజారెడ్డి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు మూడు వికెట్ల తేడాతో అనంతపురం జట్టుపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 44.2 ఓవర్లలో 158 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం 159 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44.0 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి మూడు వికెట్ల తేడాతో ఘన విజ యం సాధించింది. ఆ జట్టు లోని ప్రనిల్ రెడ్డి 54 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని ప్రదీప్ రెడ్డి, అర్జున్ టెండూల్కర్ చేరో రెండు వికెట్లు తీసుకున్నారు. కెఒ ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై కర్నూలు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 49.5 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజ రెడ్డి 66 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని బ్రహ్మ సాయి తేజ రెడ్డి, రాజ్దీప్ జచిన్, నవీద్ లు ఒక్కొక్కరు రెండేసి వికెట్లు తీసుకున్నారు. అనంతరం 211 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 38 ఓవర్లలో 151 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టు లోని లోహిత్ లక్ష్మి నారాయణ 42 పరుగులు చేశాడు. కర్నూలు జట్టు లోని ఎన్. విష్ణువర్ధన్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు.

కామన్ సివిల్ కోడ్‌ను ఐక్యతతో వ్యతిరేకిద్దాం

ముస్లిం ఐక్యవేదిక గౌరవాధ్యక్షులు సలావుద్దీన్ పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రం లోని ప్రధాన పార్టీ నాయకులు ఏ ఒక్కరు యూనిఫామ్ కామన్ సివిల్ కోడ్ పై వులకడం లేదని పలకడం లేదని, పార్టీలకతీతంగా వ్యతిరేకిద్దామని, ఐక్యతతో ఎదుర్కొందామని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పిలుపునిచ్చారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ యుసిసి వల్ల జరిగే అనర్థాలు తెలిపి జాగృతి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న యూనిఫామ్ కామన్ సివిల్ కోడ్‌కు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు, జాగృతి కార్యక్రమాలు చేపట్టాల్సిన నాయకులు లా కమిషన్ అభిప్రాయ సేకరణ గడువు దగ్గర పడుతున్న కిమ్మనకుండా చీమకుట్టినట్లు కూడా లేకుండా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. బిజెపి రానున్న 2024 లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఒడిపోతుందన్న భయంతో కొత్త నినాదానికి తెరలేపిందన్నారు. శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టే యోచనలో ఉందన్నారు. లా కమిషన్ ప్రజల అభిప్రాయాలను ఈ నెల 14 వతేదీ వరకు తీసుకుంటుందని పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీ ప్రజా ప్రతినిధులతో పాటు. అన్నివర్గాల ప్రజా ప్రతినిధులు, మేధావులు, విద్యావంతులు ఈ విషయం పై స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి మనువాదాన్ని అనుసరిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తుందని విమర్శించారు. అందరు ముందుకు వచ్చి కార్యాచరణ రూపొందించి కార్యక్రమాలు చేపడదామన్నారు.



మాట్లాడుతున్న ముస్లిమ్ ఐక్యవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు సలావుద్దీన్

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

కడప : మాదకద్రవ్యాలైన గంజాయి, మత్తుపదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టడానికి జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి. మాదకద్రవ్యాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి పాల్గొన్న కలెక్టర్ విసి ముగిసిన అనంతరం మాట్లాడుతూ మాదకద్రవ్యాల మూల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు అవలంభించాలని తెలిపారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మాదకద్రవ్యాలు విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. వాటి బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీస్ శాఖకు సూచించారు. బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు పునరావాసం కల్పించాలని అన్నారు. మత్తు పదార్థాల సరఫరాపై సమాచారం అందించేందుకు ప్రభుత్వ టోల్ ఫ్రీ నెం.15400 ను విద్యాసంస్థలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలని చెప్పారు.

అర్హులైన మత్స్యకారులకు లైసెన్సులు

కడప : జలాశయాల్లో సమీపంలో ఉండే అర్హులైన మత్స్యకారులకు లైసెన్సులు మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఏపీ ఉద్యాన శాఖ సలహాదారుడు పి. శివప్రసాద్ రెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారులకు సూచించారు. మంగళవారం శివప్రసాద్ రెడ్డి వైఎస్ఆర్ జిల్లాలో మత్స్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. శాఖలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాల గురించి జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు, ఇతర అధికారులతో సమీక్షించారు. ప్రధానమంత్రి మత్స్య సంపద సంయోజన పథకంలో వివిధ యూనిట్ల అమలు గురించి పరిశీలించారు. చేపల లైసెన్సులు ఇచ్చే జలాశయాల్లో చేప పిల్లల విడుదల, కడప నగరంలో చేపల మార్కెట్ వివరాల గురించి అధికారులతో ఆయన చర్చించారు.


ఆర్‌డిఒతో మాట్లాడుతున్న టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

నిజమైన లబ్ధిదారులనే ఎంపిక చేయాలి
- టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా నిరుపేదలకు అసైన్‌మెంట్ భూములు ఇవ్వాలనే ప్రక్రియ జరుగుతోందని, కానీ పులివెందుల నియోజకవర్గంలో నిజమైన లబ్ధిదారులకు కాకుండా అనర్హులకే కేటాయించడం ఎంతవరకు సమంజసమని టిడిపి ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ వెంకటేశులును ఆయన అసైన్‌మెంట్ భూములు సంబంధించి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అసైన్ కమిటీ ఆమోదం లేకుండానే జాబితాను ఆమోదించారని, ఇది వాళ్ల దారుణమని ఆయన పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గంలో ఉన్న తప్పులపై ఆయన ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని అనర్హులకు అప్పగించే పని జరుగుతుందన్నారు. విఆర్‌ఒ నుంచి జాయింట్ కలెక్టర్ వరకు ఎవరు కూడా విచారణ జరపకుండా ప్రభుత్వ భూములను ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయించారని చెప్పారు. ఇప్పటి వారికే మళ్లీ భూములు ఇవ్వడం దారుణం అన్నారు. పేదలకు కాకుండా వైసిపి నాయకులు కార్యకర్తలకు ప్రభుత్వ భూములను అప్పగిస్తున్నారని వాపోయారు. న్యాయబద్ధంగా విచారించకపోతే ఆర్‌డిఒను కోరామని తెలిపారు. లేనిపక్షంలో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఇందులో అర్హులు దాదాపు ఉంటే 9 మంది తప్ప మిగతా వారంతా అనర్హులే ఉంటారని దీనిపై ఈ ప్రక్రియను పూర్తిగా అధికారులు విచారించాలని పేర్కొన్నారు. సమావేశం జరుపుకుండానే వైసిపి నాయకులు డైరెక్ట్‌గా ఇన్‌ఛార్జి మంత్రి వద్దకు తీసుకువెళ్లి ఆమోదింపజేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై న్యాయ విచారణ కచ్చితంగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు కార్యక్రమంలో టిడిపి నాయకులు మైసూర్ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బి. కోడూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యులు వినీత్‌రాజు, ఉదయ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఎఎన్‌ఎం, సిబ్బంది, ఆశాలు రాబోవు సీజన్ వ్యాధులను అరికట్టేందుకు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో శిబిరాలు ఏర్పాటు చేసి డెంగీ, మలేరియా, జలుబు వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్లు హెల్త్ సూపర్‌వైజర్ నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, పుష్పాంజలి, నాగమణి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలి

పులివెందుల రూరల్ : పులివెందుల పురపాలక వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వెంటనే పరిష్కరించాలని పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డికి పులివెందుల పురపాల ఇన్‌ఛార్జి, వైస్ చైర్మన్ వైయస్ మనోహర్ రెడ్డి, పురపాలక చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ సూచించారు. మంగళవారం పులివెందులలోని పలు వార్డులను వారు పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే ప్రజల తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామని వారు తెలిపారు. ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష పథకం ద్వారా ఉచితంగా పదకొండు సేవలను అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు., 4వ వార్డు వైసిపి నాయకులు కడియాల లక్ష్మీనారాయణ, ఎపి పురపాలక శాఖ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, పురపాలక వైస్ చైర్మన్ హాఫీజ్, 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్ ఉన్నారు.

రూ.50లకే కిలో టమోటా : చైర్మన్

పులివెందుల రూరల్ : టమోటాలు ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.140 నుంచి రూ. 150 వరకు విక్రయిస్తున్నారని, పులివెందుల మార్కెట్ యార్డుకు మంగళవారం రెండు టన్నుల టమోటాలు వచ్చాయని, బుధవారం ఉదయం 10 గంటల నుంచి సబ్సిడీతో కిలో రూ.50లకే విక్రయిస్తారని చైర్మన్ గోటూరు చిన్నప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విక్రయాలను పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వై.ఎస్. మోహన్‌రెడ్డి, వైసిపి వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.ఎస్. అభిషేక్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు తమ వెంట ఆధార్‌కార్డు తీసుకొచ్చి కిలో టమోటాలను రూ.50 లకు తీసుకెళ్లవచ్చన్నారు.

విద్యార్థి సఫీన మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

పట్టణంలోని విశ్వజ్యోతి పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థి సఫీన అదే స్కూల్ బస్ కింద పడి చనిపోయిందని, ఆమె మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సిఐటియు నాయకులు దాసరి విజయ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బి అత్యధిక గృహంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతి ప్రయివేట్ పాఠశాలను తనిఖీలు చేయడలో విఫలమయ్యారని వాపోయారు. మండల విద్యాశాఖ అధికారి ప్రతి పాఠశాలలను పర్యవేక్షణలో ఘోర వైఫల్యం చెందారని తెలిపారు. ప్రొద్దుటూరు ఆర్‌టిఒ అధికారులు కూడా విద్యాసంవత్సరం ప్రారంభమైన ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్నారని తెలిపారు. డ్రైవర్లు అతివేగంతో ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. బస్సులో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నారని చెపాప్రు. ప్రవేట్ యాజమాన్యాలపై తప్పనిసరిగా విద్యాశాఖ అధికారులు, స్కూల్ బస్సుల పైన ఆర్‌టిఒ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి స్పందించి ఎ స్కూల్స్ ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థిని తండ్రి గౌస్ కుంటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దివాకర్, సుభాహన్, కమాల్‌బాష, శ్రీను పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాటుసారా కేసులో ముగ్గురు అరెస్టు

పులివెందుల రూరల్ : పులివెందుల కదిరి రోడ్డులో ఉన్న గంగమ్మ గుడి దగ్గర సత్యసాయి జిల్లా తలుపుల మండలం ఎపిలి పల్లి గ్రామం నుంచి పులివెందుల పట్టణానికి నాటుసారా తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఎన్ఫోర్స్మెంట్ సీఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎపిలిపల్లికి చెందిన మంకాపుల్లయ్య వద్ద నగరిగుట్టకు చెందిన కావేటి శ్రీరాములు, కావేటి వెంకటమ్మ అనే వారు విక్రయిస్తుండగా దాడులు చేశామని చెప్పారు. మంకా పుల్లయ్యతో పాటు కావేటి శ్రీరాములు, కావిటి వెంకటమ్మ ముగ్గురిని అరెస్టు చేసి 40 లీటర్ల నాటు సారాయి సీజ్ చేశామని తెలిపారు. వారిని పులివెందుల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా వారికి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారి ముగ్గురిని పులివెందుల సబ్ జైలుకు తరలించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో స్టేషన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, పులివెందుల పోలీస్ స్టేషన్ ఎస్ఐ హుస్సేన్ సిబ్బంది ఈశ్వరయ్య, రాజశేఖర్, గీత, బాలగంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఎర్రగుంట్ల : జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె వద్ద పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఇబి ఎస్ఐ శశిధర్ పేర్కొన్నారు. సున్నాపురాళ్లపల్లి నుంచి కలమల్ల మీదుగా ప్రొద్దుటూరుకు తరలిస్తుండగా మాలపాడు వద్ద పట్టుకున్నామని తెలిపారు. ట్రాక్టర్లను ఎర్రగుంట్ల స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. అనంతరం రూ.10 వేల జరిమానా విధించామన్నారు.

యువతకు ఆదర్శనీయం 'అల్లూరి'

ప్రజాశక్తి - కడప

స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు ఈ తరం యువతకు ఆదర్శనీయమని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ స్పందన హాలులో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వార్షోత్సవాల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి సమాజానికి.. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు ఆదర్శనీయం అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, ఆయన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశ స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, అందుకోసం తన ప్రాణాలర్పించిన యోధుడన్నారు. ప్రతి ఏడాది జూన్ 27 నుంచి జూలై 4వ వరకు అన్ని విద్య సంస్థల్లో పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. అంతకుముందు సమావేశానికి ఆహ్వానిత ముఖ్య అతిథులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిపిఒ ప్రభాకర్ రెడ్డి, జిల్లా సాంస్కృతిక పర్యాటక శాఖాధికారి మల్లికార్జున, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. **ఎస్, ఎటిటి ఉపాధ్యా సంఘం కార్యాలయంలో** అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్ర బాబు, కార్యదర్శులు కృష్ణా నాయక్, జయరాం పాల్గొన్నారు. **డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో..** మన్యం వీరుడు, విప్లవ యోధుడు బ్రిటిష్ సామ్రాజ్యంపై ఎక్కుపెట్టిన బాణం అల్లూరి సీతారామరాజు అని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. వ అల్లూరి జయంతి ని పురస్కరించుకుని డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ జిల్లా కార్యాలయంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరబాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఆర్ నాయక్, సగిలి. రాజేంద్ర ప్రసాద్, డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు షాకీర్, జిల్లా ఉపాధ్యక్షులు


అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

డేవిడ్ రాజ్, రెబ్బా.నరసింహులు, ఎస్ఎఫ్ఐ సురేష్ నాయక్, మనోజ్, డివైఎఫ్ఐ సురేంద్ర పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో** అల్లూరి సీతారామరాజు జయంతిని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, రామకృష్ణ, నరసింహారెడ్డి, బద్రి, రాఘవయ్య, రవి, శివారెడ్డి, బాలం సుబ్బరాయుడు, నామా వినయ్, సుబ్రమణ్యం, ఆరుశేర్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు. **ముద్దనూరు :** స్థానిక వైసిపి కార్యాలయంలో మన్యం వీరుడు, విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మండల కన్వీనర్ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో అల్లూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయరాం నాయుడు,సిద్దు,సుబ్బయ్య, సురేంద్ర నాయుడు, రమణా, రామకృష్ణ రెడ్డి, వాసు, రామసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** దేశం కోసం ప్రాణాలు అర్పించిన అతి కొద్ది మందిలో అల్లూరి సీతారామరాజు ఒకరని కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు, స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరులో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ, కెవికె శాస్త్రవేత్తలు శిల్పకళ, డాక్టర్ మహేష్ బాబు, ప్రశాంతి, మహేశ్వరి, సాయి మహేశ్వరి, మానస, రామలక్ష్మి దేవి, ప్రత్యూష పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ఏ ఒక్కరూ లబ్ది పొందలేదనే పరిస్థితి రాకూడదని 'జగనన్న సురక్ష'ను ప్రభుత్వం తీసుకువచ్చిందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని 4వ డివిజన్ పరిధిలోని ఆర్.కె. నగర్ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'జగనన్న సురక్ష' శిబిరానికి కలెక్టర్ , నగర మేయర్ సురేష్ బాబు, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, ఆదాయ, కుల, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ధర్మచంద్రా రెడ్డి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు వినోద్, 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ రెడ్డి, 4వ డివిజన్ ఇంచార్జి ఆర్.వి.ఆర్. రమణ, తహశీల్దార్ శివరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** పురపాల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని సీయోనుపురం వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్. మనోహర్‌రెడ్డి ప్రజలకు ఆదాయ, వివాహ, జనన, మొదలైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కమిషనర్ నరసింహారెడ్డి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** మండలంలోని హనుమనగుత్తి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపును తహశీల్దార్ నాగేశ్వరరావు, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సుబ్బమ్మ, ఎంపిటిసి సృజనా దేవి, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొ న్నారు. **చాపాడు :** మండల పరిధిలోని బద్రిపల్లెలో జగనన్న సురక్షను ఎంపిటిసి లక్ష్మమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాధాకృష్ణ వేణి, ఎఒ రామాంజనేయులు, ఎఓ మ్యాగీ, పంచాయతీ కార్యదర్శి సురేష్, విఆర్‌ఓ ముని శేఖర్, గ్రామ నాయకులు రామ సుబ్బారెడ్డి, ఓబుళ రెడ్డి, పుల్లయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** రంగసముద్రం పంచాయతీ రెండవ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్ ఆధ్వర్యంలోనిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చంద్రమౌళి, స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎంపిటిసి కల్వకూరి రమణ యువజన విభాగం అధ్యక్షులు గిరి ప్రణీత్ రెడ్డి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

యువతకు 20 లక్షల ఉద్యోగాలు : పుట్టా

ఖాజీపేట : టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం మండలం పరిధిలోని చెములపల్లెలో భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య యాత్ర కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలను పేద, బడుగు, బలహీన, వెనుకబడిన ప్రజలందరికీ వివరించారు.. రైతన్నకు తెలుగుదేశం అండగా ఉంటుందని వారికి ప్రతీ యేటా వ్యవసాయ అవసరాల కోసం రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం కోసం మహాశక్తి పథకం ద్వారా జిల్లా పరిధిలో ఆర్‌టిసి ప్రయాణం ఉచితమని, ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా అందించడంతోపాటు, తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ. 15 వేల రూపాయలు అందజేయనున్నట్లు చెప్పారు. యువగళం నిధి కింద యువతకు నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామన్నారు. పేదలందరికీ రక్షిత మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలియచేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, పత్తూరు ఉపసర్పంచ్ ముత్తూరు రమణ, రెడ్యం వెంకట్రామిరెడ్డి, పుట్టా ప్రభాకర్ యాదవ్, మిల్లు శీను, పిచ్చినాయుడు, నంద్యాల సుబ్బయ్య, జెండాల మహబూబ్‌బాషా, రామానాయుడు, ప్రతాప్ రెడ్డి, ఫరూక్, హరిప్రసాద్ యాదవ్, బాల వెంకటయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగుల ధర్నా

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని ఈనెల 6న నిరుద్యోగుల ధర్నా నిర్వహించనున్నట్లు ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి గంగా సురేష్, నాయకులు సి మస్తాన్ తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల ఐటిఐ కళాశాలలో ధర్నాకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేశారు. కడప కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నామని నిరుద్యోగులంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.కె మనిద్దీన్ , శంకర్, విఘ్నేశ్వర, స్నేహ పాల్గొన్నారు.

నల్లపురెడ్డిపల్లెలో ఆశా డే

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె పిహెచ్‌సిలో మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎల్‌సిడిసి కార్యక్రమం ఈనెల 26 నుంచి ప్రారంభమైందని చెప్పారు. దీనికి సంబంధించి సర్వేలు, ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాలపై సమీక్షించారు. డాక్టర్ లిఖిత మాట్లాడుతూ కుష్టు వ్యాధి నివారణపై తగిన సూచనలు, సల హాలిచ్చారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు టిడిపి విస్తృత స్థాయి సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణలో బుధవారం నిర్వహించే తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.టెక్ రవి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో ఉన్న సాయికృప లేఅవుట్‌లో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతి థులుగా శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని నగరిగుట్ట నిరాశ్రయులవసతి గృహంలో పట్టణ సిఐ రాజు మామ ఇ.మూర్తి పుట్టిన రోజు సందర్భంగా పురష్కరించకొని జ్ఞాపకార్థం అనాథలకు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వీట్లు , పండ్లు, ఇతర ఫలహారాలు అందజేశారు. వసతి గృహంలో దోమలతో ఇబ్బంది పడుతున్నా అని ఫ్యాన్ వితరణ చేశారు. కార్యక్రమంలో సిఐ సతీమణి భువన, అత్త చెందామరై , ఎఎస్ఐ స్వామి, హెడ్ కానిస్టేబుల్ సహదేవ రెడ్డి, వసతిగృహ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వారు 2022 ఏడాదికి గాను "టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు" కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తూనారని స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి. సాయి గ్రేస్ తెలిపారు. అవార్డుకు 2020, 2021- 2022 సంవత్సరాల్లో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సాహస క్రీడల్లో తమను తాము అంకితం చేసుకొని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా బహుకరిస్తారు అని తెలిపారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంసా పత్రం, రూ. 15 లక్షల నగదు అందిస్తారని తెలిపారు. ఈ అవార్డు కోసం ఆన్ లైన్ వెబ్ సైట్ https://awards.gov.in ద్వారా 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు వైద్యాధికారి

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -ఖాజీపేట

కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కుష్టు నివారణ అధికారి, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్ ఖాదర్ వల్లీ సిబ్బందికి తెలియజేశారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టు వ్యాధి నివారణ చర్యలలో భాగంగా కుష్టు వ్యాధిపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలను ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎస్.అయేషా సుల్తానా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశానికి హాజరైన డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ కుష్టు వ్యాధిపై చేపట్టిన సర్వే తీరును పరిశీలించి సంతృప్తి ని వ్యక్తం చేశారు. గ్రామాలలో కుష్టు వ్యాధి నివారణ అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోగులు ఉన్నట్లు అయితే వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రారంభ దశలోనే వ్యాధి గుర్తించి చికిత్స చేయిస్తే త్వరగా నయం అవుతుందన్నారు. మండలంలోని ప్రజలందరికి పరీక్షలు చేసి ఎవరైనా కుష్టు అనుమానితులు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి కి సంబంధించి స్పర్శ లేని మచ్చలు, పొడలు కానీ ఉన్నట్లు అనుమానం వస్తే, వెంటనే డాక్టర్ దగ్గరికి పోయి చూపించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం వల్లీ అన్ని జాతీయ కార్యక్రమాల గురించి ఆరా తీసి, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్‌ఎంలను, సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కోటంగురువాయ పల్లె, ఆంజనేయ కొట్టాలు, పుల్లూరు, పత్తూరు గ్రామాలలో జరుగుతున్న సర్వే లను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ అయేషా సుల్తానా, మండల ఆరోగ్య విస్తరణ అధికారులు మాచనూరు రాఘవయ్య, బి.నాగభూషణం, సి హెచ్‌ఒ వెంకటసుబ్బమ్మ, ఆశా నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్ వైజర్ కృష్ణప్రియ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చాపాడు : కుష్టు వ్యాధి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అడిషనల్ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఖాదరవల్లి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు, ఎఎన్‌ఎంలకు, సిహెచ్‌ఒలకు కొన్ని సూచనలు, సలహాలు అందజేశారు. అనుమానిత, స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు ఉన్న వాళ్లను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌కుమార్, కావ్య మాధురి, ఓబులేష్, సిహెచ్‌ఒ మహదేవ్ యాదవ్, సూపర్‌వైజర్ సరస్వతి, భాస్కర్, నారాయణరెడ్డి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పిహెచ్‌సికి అదనపు గదులు మంజూరు

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత నిచ్చి ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సౌకర్యాలు కల్పిస్తుంది. అందులో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండు అదనపు భవనాలు మంజూరు చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కరిష్మా, శ్రీకాంత్ తెలిపారు. భవనం నిర్మాణానికి 40.25 లక్షలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. టెండర్లు పూర్తి చేసి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఇందులో ఆఫీసు, ల్యాబ్, రెసెప్షన్, వేచి యుండు గది, స్టోర్ రూమ్ గదులను ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. ప్రభుత్వాస్పత్రికి మెరుగైన వసతులు కల్పించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా అందించే వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని భూమాయపల్లిలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు అబూబకర్ సిద్ధిక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, నాయకులు హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -ఖాజీపేట

మైదుకూరు పట్టణంలోని బద్వేల్ రోడ్డులో ఉన్న ఎస్ఎల్ఆర్ ఆసుపత్రి ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ మూలే రామ అనిల్ కుమార్ రెడ్డి, డాక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డాక్టర్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్, ఇసిజి, టు డిఎకో పరీక్షలతో పాటు రూ.3500 విలువైన పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేశారు.